క్లుప్తంగా

రక్షిత తాగునీరు సరఫరాకు చర్యలు



సాక్షి ఎఫెక్ట్

పొన్నూరు: నిడుబ్రోలు రక్షిత తాగునీటి పథకం ద్వారా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు నిరంతరం రక్షిత నీటిని అందించే విధంగా చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అన్నారు. పట్టణంలోని 8వ వార్డు క్యాబిన్‌పేటలో కుళాయి ద్వారా సరఫరా అవుతున్న కలుషిత నీటితో స్థానికుల ఇబ్బందులను తెలియజేస్తూ శుక్రవారం కలుషిత జలం.. ప్రజల జీవితాలతో చెలగాటం శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనంపై కమిషనర్ స్పందించారు. ఉదయాన్నే వార్డులో పర్యటించి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. కుళాయి నీటిని పరిశీలించి త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. మున్సిపల్ ఏఈ రాజేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో విద్యా దినోత్సవం

గుంటూరు రూరల్: జొన్నలగడ్డలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం బాల్య ఆరంభ దశ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ ఆంజనేయ ప్రసాద్, ఉపసర్పంచి నామ శ్రీనివాసరావు, మాజీ ఉపసర్పంచి వంగ నవీన్‌రెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటరమణ, మహిళా పోలీస్ కల్పనాకిరణ్, అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ



గుంటూరు రూరల్: ఇంటిముందు నిలిపిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన ప్రత్తిపాడు మండలం యనమదలలో చోటు చేసుకుంది. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన వివరాలు.. యనమదల గ్రామం కొండ్రుపాడు డొంక వైపున ఉన్న ఆంజనేయస్వామి దేవస్థానం వెనుక ఉన్న ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనాన్ని దుండగులు రాత్రి సమయంలో చోరీ చేశారు. అర్ధరాత్రి సమయంలో ఇద్దరు ఇంటిముందు ఉంచిన వాహనాన్ని తీసుకెళ్లారని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడి ఇంటిలోని సీసీ కెమెరాలో రికార్డ్ అయిన దృశ్యాల మేరకు దుండగులు ఎటువెళ్లారు, అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు



పెదకాకాని: చదువుల తల్లి సావిత్రీబాయి పూలే మహిళల అభ్యున్నతికోసం ఎనలేని కృషి చేశారని ఏఐఎం గుంటూరు జోనల్ ఇన్‌చార్జి మదిర శేషయ్య అన్నారు. పెదకాకాని లీమ మానసిక వికలాంగులు అనాథ ఆశ్రమంలో పూలే జయంతి నిర్వహించారు. గుంటూరు ఏఐఎం ఇన్‌చార్జి బండ్లమూడి చక్రి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జి.శ్యామ్ ముఖర్జీ, కె.యలమందరావు, ఎం.సురేష్, బి.గోపాలకృష్ణ, బి.భాను, డి.కిరణ్, ఎం.రవి, బి.కిషోర్, కె.డేవిడ్, కె.మోహన్, అమిరె రమేష్, వి.వినీల్, నాగరాజు, మంచాల ఏసోబు, చప్పిడి సుబ్బారావు, ఎంజాయ్ యూత్, అంబేడ్కర్ యూత్ పెదకాకాని సభ్యులు పాల్గొన్నారు.

ల్యాబ్ నివేదికల్లో కచ్చితత్వం పాటించాలి

గుంటూరు మెడికల్: ల్యాబ్ రిపోర్ట్‌లలో కచ్చితత్వం పాటించాలని, కీటకాల ద్వారా వ్యాపించే వ్యాధులపై మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్లు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ల్యాబ్ రిపోర్ట్‌ల రిజిస్టార్లు ప్రతినెలా అప్‌డేట్‌గా ఉండాలని చెప్పారు. దోమలు, లార్వాల నివారణ చర్యల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. మలేరియా, డెంగీ జ్వరాలను అశ్రద్ధ చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించి చికిత్స విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ల్యాబ్ టెక్నీషియన్‌ల నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మలేరియా నివారణ జిల్లా అధికారి సుబ్బరాయణం, అసిస్టెంట్ అధికారి రాజునాయక్, ఆరోగ్య విస్తరణ అధికారి సుధా శివగణేష్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు వినతుల వెల్లువ..

- పొన్నూరు పరిధిలో 645 అర్జీలు
- ఇప్పటి వరకు 172 అర్జీలు పరిష్కారం
- భూ సమస్యలు సత్వర పరిష్కారం దిశగా చర్యలు
- తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్

పొన్నూరు: రెవెన్యూ శాఖ పరిధిలోని వివిధ సమస్యలతో పాటు ప్రధానంగా భూ సమస్యల పరిష్కారానికి పొన్నూరు మండలంలో గత నెల 6వ తేదీ నుంచి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. ఈ నెల 8వ తేదీ వరకు మండలంలో సదస్సులు కొనసాగనున్నాయి. ఈ నెల 4వ తేదీ నాటికి 18 గ్రామాల్లో సదస్సులు పూర్తి కాగా వివిధ అంశాలపై ప్రజల నుంచి 645 అర్జీలు అందాయి. స్వీకరించిన అర్జీలలో ఇప్పటి వరకు 172 పరిష్కరించినట్లు అధికారులు వెల్లడించారు.

రెవెన్యూ సదస్సులు నిర్వహించే గ్రామాల జాబితాను రెవెన్యూశాఖ ముందుగానే ప్రకటించింది. దీని ప్రకారం ఆయా గ్రామాల్లో ప్రజల సమాచారం అందిస్తున్నారు. భూ సంబంధిత సమస్యలు, రెవెన్యూ శాఖ పరిధిలో సమస్యలున్న వారు ఈ సదస్సులకు హాజరై అధికారులకు అర్జీలు అందజేస్తున్నారు. చిన్న, వెసులుబాటు ఉన్న అర్జీలను అప్పటికప్పుడే పరిష్కరి స్తున్నారు. మ్యుటేషన్, ఇతర భూ సంబంధిత సమస్యలైతే నిర్ణీత కాల వ్యవధిలో ప్రాధాన్య క్రమంలో పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నారు. అత్యధికంగా మ్యుటేషన్లు, పాసు పుస్తకాలు, భూ హక్కులు, రీసర్వే సమస్యలపై ఎక్కువ అర్జీలు అందుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. రెవెన్యూ, సర్వే, దేవాదాయ తదితర శాఖల అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు ఈ సదస్సుల్లో భాగస్వాములవుతున్నారు.



నిడుబ్రోలులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ జియా

7 నుంచి 60 రోజుల్లో పరిష్కరిస్తాం

రెవెన్యూ సదస్సుల్లో అందిన అర్జీలు, ఫిర్యాదులకు 7 రోజుల నుంచి 60 రోజుల్లో పరిష్కారం చూపుతాం. కొన్ని సేవలకు సంబంధించిన అంశాలను గంటలు, రోజుల వ్యవధిలోనే పరిష్కరిస్తున్నాం. ఈ నెల 8వ తేదీ వరకు గ్రామాల్లో జరిగే సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

–మహమ్మద్ జియావుల్‌హక్, తహసీల్దార్, పొన్నూరు



విజ్ఞాన్‌లో జ్యోతిప్రజ్వలన చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు



రైతు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ మరియు రైతు నేస్తం ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా 'అభ్యుదయ రైతుల పురస్కారాలు–2025' పేరుతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 250 మంది అభ్యుదయ రైతు దంపతులకు సన్మాన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి సంబరాలు సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. –చేబ్రోలు

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు

చేబ్రోలు: బ్రెయిలీ లిపి అంధ విద్యార్థులకు బంగారు భవిష్యత్‌కు ఉపయోగపడుతోందని మండల విద్యాశాఖాధికారి రాయల సుబ్బారావు అన్నారు. చేబ్రోలు కొత్తపేట ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతి నిర్వహించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్లకార్డులతో అంధుల ఆశాజ్యోతి, అంధుల అక్షర శిల్పి లూయిస్ బ్రెయిలీ అనే నినాదాలతో తల్లిదండ్రులకు అవగాహనను కల్పిస్తూ ర్యాలీని నిర్వహించారు. ఎంఈఓ సుబ్బారావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా దృష్టి లోపంతో జీవితం గడుపుతున్న వారందరికీఈ రోజు ప్రత్యేకమైన రోజు లూయిస్ బ్రెయిలీ పుట్టిన రోజును బ్రెయిలీ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. అంధుల కొరకు ప్రత్యేకంగా ఆరుచుక్కల లిపిని లూయిస్ బ్రెయిలీ రూపొందించారన్నారు. భవిత కేంద్రం ఉపాధ్యాయులు జీ అనూరాధ, జీ రాజేష్ మాట్లాడారు. సీఆర్పీ మల్లేశ్వరి పాల్గొన్నారు.



చేబ్రోలు భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంఈఓ సుబ్బారావు

కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

చేబ్రోలు: పంచాయతీలో దీర్ఘకాలంగా పని చేస్తున్న కార్మికులను తొలగించిన వారిని వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. చేబ్రోలులో అక్రమంగా తొలగించిన 12 మంది కార్మికులను తిరిగి విధుల్లోకి చేర్చుకోవాలని చేపట్టిన ఆందోళన శనివారానికి నాలుగో రోజుకు చేరింది. శిబిరాన్ని పాశం రామారావు సందర్శించి మాట్లాడుతూ ప్రశాంతంగా ఆందోళన చేస్తున్న కార్మిక నాయకుని అరెస్టు చేయటం సరికాదన్నారు. తొలగించిన 12 మంది కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ తొలగింపులకు ఎవరు పాల్పడిన దానిని తిప్పి కొట్టాల్సిన అవసరం కార్మిక వర్గంపై ఉందని చెప్పారు. జిల్లా పంచాయతీ అధికారికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ, పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి చింతల శ్రీను, నాయకులు సీహెచ్ హనుమంతరావు, ఆదిశేషు, రాం బ్రహ్మాచారి, రాఘవమ్మ, దివ్యశ్రీ, నాగేశ్వరమ్మ, సుజాత, దీపిక పాల్గొన్నారు.



చేబ్రోలులో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు రామారావు

ధాన్యం నిల్వలో జాగ్రత్తలు పాటించాలి

యాజమాన్య పద్ధతులు అవసరం

పెదకాకాని: కష్టపడి పండించిన పంటను ఇంటికి చేర్చడం, వాటిని నిల్వ చేసుకోవడం ఎంతో కష్టసాధ్యమైన పని. ఏడాది పొడవునా దాచే ధాన్యం దెబ్బతింటాయి. అందుకు ధాన్యం నిల్వల్లో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాల్సి ఉంది. ప్రస్తుతం మండలంలో కొందరు రైతులు పొలం నుంచి ధాన్యం ఇంటికి చేరగానే అమ్ముకుంటున్నారు. తిండి గింజల కోసం, ధర వచ్చినప్పుడు అమ్ముకోవడానికి ధాన్యాన్ని నిల్వచేసే రైతులు అందుకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యవసాయ అధికారుల సూచనలు ఇలా...

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- ధాన్యం మొత్తం గింజ కట్టి చేనంతా ఎర్రబడిన తర్వాత కోతలు కోయాలి
- నూర్చిన ధాన్యం 12 శాతం తేమ ఉండే వరకు ఆరబెట్టాలి.
- రసాయన ఎరువులను ధాన్యంపై నేరుగా పిచికారీ చేయకూడదు. ఇలా చేస్తే విష ప్రభావం ఎక్కువగా ఉండి ఆరోగ్యాలు దెబ్బతింటాయి.
- ధాన్యంపై కీటకాలు, పురుగులు ఆశించకుండా వేపాకు, సీతాఫలం గింజలు, వెల్లుల్లి, ఉసిరి గింజలను పొడి చేసి రెండు శాతం వరకు పొడిని ధాన్యంలో కలపాలి.

ఇలా చేస్తే ఎనిమిది నెలల వరకు ధాన్యంలో పురుగు చేరకుండా ఉంటుంది.

- గ్రామీణ ప్రాంతాల్లో దొరికే ఉత్తరేణి, కసివింద, ఉమ్మెత్త, మిరప, వేపాకు, కీసర చెట్టు ఆకులను ధాన్యం బస్తాల్లో కలిపి ఉంచితే నాలుగు నెలల వరకు పురుగు చేరదు.

గోదాముల్లో ధాన్యం నిల్వ

- గోదాము నేల పైన, గోడలకుపైన కప్పులకు రంధ్రాలు లేకుండా చూసుకోవాలి
- తుఫాన్ గాలులకు పై కప్పులు ఎగిరిపోకుండా ముందుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. రంధ్రాలు ఉంటే సిమెంట్‌తో పూడ్చాలి. ధాన్యం నిల్వకు పాత గోనె సంచులను ఎక్కువగా ఉపయోగించరాదు.
- గోనె సంచులను ముందుగా 2 మిల్లీ లీటర్ల మలాథియాన్ మందు ద్రావణంలో నాన బెట్టి ఎండలో ఆరబెట్టాలి.
- గోదాము గోడలకు, నేలపై పురుగు ఆశించకుండా పది మిల్లీ లీటర్లు మలాథియాన్ మందును లేదా ఏడు మిల్లీ లీటర్లు డైక్లోర్వాస్ మందును నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

చెక్కబల్లలపై ధాన్యం బస్తాలు వేసుకుంటే తేమ తగలకుండా ఉంటుంది.

- గోడలకు, పై కప్పుకు ధాన్యం బస్తాలు తగలకుండా నిట్ట వేసి, వర్షం నీరు గోదాముల్లోకి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

ఎక్కువ కాలం ధాన్యం నిల్వ ఉంచకుండా సకాలంలో అమ్ముకుంటే రంగు మారదు. దిగుబడితో పాటు నాణ్యత ఉంటుంది. బస్తాలను 1- 2 అడుగుల ఎత్తులో బెంచీలు, అరుగులమీద వేస్తే భూమిపై ఉన్న తేమ లాక్కోదు.



వెంకటకృష్ణాపురం గ్రామంలో రైతులు ఆరబెట్టిన ధాన్యం

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

చినలింగాయపాలెం(కాకుమాను): ఇంటర్ విద్యార్థినులు కూడా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండలంలోని చినలింగాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఇంటర్ విద్యార్థినులకు శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 కె.విజయ్ భాస్కర్, హెచ్‌ఎం బి.నాగరాజు పాల్గొన్నారు.

చేబ్రోలు: మండల కేంద్రమైన చేబ్రోలులోని సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాయల సుబ్బారావు, ప్రిన్సిపాల్ కె.సుచరిత, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మైలా వెంకట రామరాజు, వడ్లమూడి మాజీ సర్పంచి వీరంకి రంగారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలి

చేబ్రోలు: రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు డిసెంబర్ నెల జీతాలు చెల్లించకపోవటం విడ్డూరంగా ఉందని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, మండలంలోని శేకూరు జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు మేకల సుబ్బారావు శనివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేకల సుబ్బారావు మాట్లాడుతూ ఉద్యోగులతో మిత్ర బంధంతో పనిచేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లోనే ఉపాధ్యాయులకు జీతాలు చెల్లింపులో వివక్షత చూపుతున్నదని చెప్పారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

కాకుమాను: రైతుల భూ సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బి.వెంకటస్వామి అన్నారు. మండల కేంద్రం కాకుమాను పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులు ఆయా సమస్యలను సదస్సులలో అర్జీల రూపంలో అందజేసి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈసందర్భంగా భూమి కొలతల కొరకు 6, రికార్డులో నమోదు కోసం తొమ్మిది అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు.



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటస్వామి

11న కవితా సంకలనం 'స్వప్న వేణువు' ఆవిష్కరణ

తెనాలి: పట్టణానికి చెందిన ఉపాధ్యాయిని, కవయిత్రి కొలకలూరి దేవికారాణి రచించిన కవితా సంకలనం 'స్వప్న వేణువు' పుస్తకావిష్కరణ ఈనెల 11వ తేదీన జరుగుతుందని శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఆరోజు సాయంత్రం 4 గంటలకు ఏర్పాటయే సభకు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు అధ్యక్షత వహిస్తారు. దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి ముఖ్యఅతిథి. ప్రముఖ రచయిత, దర్శకుడు జె.బాలవర్ధిరాజు పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. కవయిత్రి షేక్ అస్మతున్నీసా, రచయితలు పింగళి భాగ్యలక్ష్మి, శిఖా ఆకాష్, ఐడీబీఐ బ్యాంక్ అత్తోట యశ్వంత్‌బాబు, ఈఎల్‌వీ అప్పారావు పాల్గొంటారు. ఒంగోలుకు చెందిన విద్యాధర ప్రభాస కార్యక్రమ నిర్వాహకులు.

అలరించిన విశ్వంభర భజన



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో జరగ్గా, తిరుప్పావై అమృతవర్షిణి డాక్టర్ కోగంటి వెంకట రంగనాయకి తిరుప్పావై ప్రవచనం, కోళ్ల చిట్టెమ్మ, రావి పూడి రమాదేవి నిర్వహణలో పెదనందిపాడు విశ్వంభర భజన సమాజం వారి భజన చేపట్టారు. ధార్మిక ప్రాంగణంలో బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల నిర్వహణలో బృహత్తర చండి యాగం నిర్వహించారు.

చిరు వ్యాపారులకు అన్యాయం

- కార్పొరేషన్‌లో కార్పొరేటర్ల ధ్వజం
- మాజీ ప్రధాని మన్మోహన్ మృతికి సంతాపం
- కౌన్సిల్ మళ్లీ వాయిదా

నెహ్రూనగర్: రోడ్ల వెంట వీధి వ్యాపారం చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్న చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కార్పొరేటర్లు రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, చిష్టి ప్రశ్నించారు. డిసెంబర్ 20వ తేదీన వాయిదా పడిన కౌన్సిల్ సమావేశం శనివారం నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు పాల్గొన్నారు. తొలుత ఇటీవల మరణించిన మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు కౌన్సిల్ మౌనం పాటించి, సంతాపం తెలిపింది.

మార్చి చివరి నాటికి వెండింగ్ జోన్లు..

గుంటూరు నగరంలో వీధి వ్యాపారం పేరుతో ఒక మాఫీయా నడుస్తుందని... దీనిని కట్టడి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. లైవ్‌లో ఉండేది ఒకరు ఐడీ కార్డు ఒకరి పేరు మీద.. ఒకే సారి రోడ్డు అక్రమించి నాలుగైదు వ్యాపారాలు చేస్తున్నారు. వీరందరిని పరిశీలిస్తున్నామని, మార్చి చివరి నాటికి నిజంగా వ్యాపారం చేసుకునే వారిని గుర్తించి, వారి స్థితిగతులు పరిశీలించిన తరువాత వారికి గుర్తింపు కార్డులు ఇవ్వడం జరుగుతుందని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. వారు మాత్రమే వెండింగ్ జోన్స్‌లో వ్యాపారం చేసుకునేందుకు అనుమతిని ఇస్తామని కమిషనర్ పులి శ్రీనివాసులు చెప్పారు.



నగర మేయర్ కావటి

అక్రమ కట్టడంపై ఫిర్యాదు చేసినా నో రెస్పాన్స్

29వ డివిజన్‌లో డ్రెయిన్‌ను ఆధారం చేసుకుని ఓ ఇళ్లు నిర్మాణం చేపట్టడంపై టౌన్ ప్లానింగ్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించలేదు.. తీరా ఇళ్లు పూర్తయిన తరువాత వచ్చి ఇంటి నిర్మాణాన్ని ఫొటో తీసుకుని చేతులు దూలుపుకున్నారు. అక్రమ కట్టడం గురించి చెప్పిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు స్పందించలేదంటూ కార్పొరేటర్ రోషన్, అధికారులను నిలదీశారు. శనివారం కూడా సభ వాయిదా పడటంతో తరువాత జరగబోయే సమావేశ తేదీని అధికారులతో చర్చించిన తరువాత ప్రకటిస్తామని మేయర్ కావటి ప్రకటించారు.


కక్ష సాధింపు చర్యలకు దిగిన కమిషనర్!

మేయర్ వద్ద పనిచేస్తున్న డ్రైవర్‌ను కూడా తొలగించి వేరే విధులకు కేటాయింపు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్‌లో చోటుచేసుకున్న చిన్న ఘటనను దృష్టిలో ఉంచుకుని మేయర్, డెప్యూటీ మేయర్ల వద్ద పనిచేసే సిబ్బంది తొలగిస్తూ కమిషనర్ పులి శ్రీనివాసులు నిర్ణయం తీసుకున్నారు. నగర మేయర్ కావటి మనోహర్ వద్ద పనిచేస్తున్న ఆరుగురు సిబ్బందిని, డెప్యూటీ మేయర్ల వద్ద పనిచేస్తున్న ముగ్గురి సిబ్బందిని కమిషనర్ చాంబర్‌కు కమిషనర్ శనివారం సాయంత్రం పిలిపించుకుని మీరు గతంలో ఎక్కడైతే పనిచేశారో అక్కడికి వెళ్లి విధులు నిర్వహించాలని ఆదేశించడంతో డెప్యూటీ మేయర్ల వద్ద చేరోక అటెండర్, మేయర్ వద్ద ఒక పీఏ, ఒక అటెండర్ మాత్రమే ఉన్నారు. నగర ప్రథమ పౌరుడైన మేయర్‌కు కారు నగరపాలక సంస్థే సమకూరుస్తుంది. ఆయనకు ఇద్దరు డ్రైవర్లు ఉండాల్సి ఉండగా... ఇద్దరు డ్రైవర్లును తొలగించి.. వారిని వేరే విధులకు వెళ్లాలని కమిషనర్ ఆదేశించారు. కౌన్సిల్ జరిగిన అంశాన్ని సాకుగా చూపి కమిషనర్ కక్ష సాధింపు చర్యలకు దిగడంపై పలువురు కౌన్సిల్ సభ్యులు కమిషనర్ తీరును తప్పుబట్టారు. సిబ్బంది తొలగింపు నగర మేయర్ స్పందించారు. సిబ్బంది తొలగింపుపై లిఖితపూర్వకంగా రాసి ఇవ్వాలని మేనేజర్‌ను ఆదేశించారు. గతంలో మేయర్లుగా పని చేసిన వారికి ఏ విధంగా ప్రొవిజన్స్ కల్పిస్తున్నారో ఆదే విధంగా తనకు సిబ్బందిని కేటాయించాలని, అంతకు మించి ఎటువంటి సిబ్బంది తనకు అవసరం లేదని మేనేజర్‌కు వివరించారు.

ప్రధాన కూడళ్లలో జిల్లా ఎస్పీ పర్యటన

నగరంపాలెం: నగర పరిధిలోని ప్రధాన కూడళ్లలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆకస్మికంగా పర్యటించారు. ఈ మేరకు శనివారం రాత్రి ప్రభుత్వ మహిళా కళాశాల కూడలి, శంకర్ విలాస్ కూడలిలో కలియ తిరిగారు. ఏయే వేళల్లో వాహనాల రద్దీగా ఉంటున్నాయి, ఎలా క్రమబద్ధీకరిస్తున్నారు, ఆయా కూడళ్లల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుపై ట్రాఫిక్ డీఎస్పీ రమేష్‌ను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహనదారులు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. అదే విధంగా శంకర్‌విలాస్ ఓవర్ బ్రిడ్జిపైకి వచ్చే, పోయే వాహనాలు ఒక క్రమపద్ధతిలో వెళ్లే విధంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ వెంట ట్రాఫిక్ పశ్చిమ పీఎస్, ట్రాఫిక్ తూర్పు పీఎస్ సీఐలు సింగయ్య, ఎ.అశోక్‌కుమార్ ఉన్నారు.



ఇంగ్లిష్ మీడియంతో సమూల మార్పులు సాధ్యం

స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

నెహ్రూనగర్: కేవలం సంపన్నులు మాత్రమే కాకుండా సామాన్యులు ఇంగ్లిష్ మీడియంలో విద్యనభ్యసిస్తేనే పేద ప్రజల జీవితాల్లో సమూల మార్పులు సాధ్యమని ఎమ్మెల్సీ, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీఎం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఇంగ్లిష్ డిక్షనరీల పంపిణీ చేశారు. గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడుతో కలసి పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ పిల్లలకు మనమిచ్చే నిజమైన ఆస్తి విద్య అని చెప్పారు. ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ఇంగ్లిష్ మీడియం దోహదం చేస్తుందని వివరించారు. ప్రపంచంలోని అత్యధిక దేశాలలోని ప్రజలు ఓవైపు తమ మాతృ భాషకు ప్రాధాన్యం ఇస్తూనే దానితో పాటు ఇంగ్లిష్ మీడియానికి పెద్ద పీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఓవైపు మన మాతృ భాషను కాపాడుకుంటూనే మరోవైపు ప్రపంచంలో అత్యధికంగా వాడుకలో ఉన్న ఇంగ్లిష్ భాషను కూడా అందిపుచ్చుకోవాలన్నదే మేధావుల నిశ్చితాభిప్రాయంగా వెల్లడించారు. స్ఫూర్తి ఫౌండేషన్ ఆవిర్భావం నాటి నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆంగ్ల భాషకు ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్లు అడకా పద్మావతి, అచ్చాల వెంకటరెడ్డి, షేక్ రోషన్, పడాల సుబ్బారెడ్డి, ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), గురవయ్య, పాపతోటి అంబేద్కర్, దూపాటి వంశీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, డిక్షనరీ దాత రఘురామిరెడ్డి, పార్టీ నేతలు సురసాని వెంకటరెడ్డి, కొత్తపేట సతీష్, సోమి కమల్, గంగాధర్‌రెడ్డి, వనజాక్షి, రెడ్డి కోటేశ్వరరావు, భాగ్యారావు, ప్రసన్న, బెంజమిన్, నీలి, మనోజ్, రత్నకుమారి, రమణి, దుర్గ, ఆలా కిరణ్, దాసు పాల్గొన్నారు.



విద్యార్థినులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం